సాక్షి అన్నమయ్య జిల్లా

ఆదివారం । 3 । డిసెంబర్ । 2023



హెచ్‌పీసీఎల్‌లో మాక్ డ్రిల్

భాకరాపేట గ్రామ సమీపంలో ఉన్న హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్‌లో మాక్ డ్రిల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. -8లో



ఆటోను ఢీకొన్న కారు, ట్రాక్టర్

ప్రయాణికులతో వెళుతున్న ఆటోను ముందు వైపు నుంచి కారు, వెనుకవైపు నుంచి ఇసుక ట్రాక్టర్ ఒకేసారి ఢీకొనడంతో ఆటోలోని మృతి చెందగా, నలుగురికి గాయాలయ్యాయి. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్ఠం	గరిష్ఠం
మొదటిరకం	రూ.180	రూ.240
రెండోరకం	రూ.100	రూ.178



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 304 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్ఠం	గరిష్ఠం
బైవోల్టిన్	435	435
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 152.460 కిలోలు

న్యూస్‌రీల్

నూతన కార్యవర్గం

కడప సెవెన్‌రోడ్స్: ఏపీ రెడ్డి సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంగులకుంట నరేష్‌కుమార్‌రెడ్డి శనివారం ప్రకటించారు. అధ్యక్షుడిగా జగన్‌మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా ఎం.రాంభూపాల్‌రెడ్డి, ఎల్వీ భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా అమర్‌నాథరెడ్డి, గంగా సతీష్‌రెడ్డి, రమణారెడ్డి, కార్యదర్శులుగా బి.వెంకట శివారెడ్డి, శివరామిరెడ్డి, సుధా అంకిరెడ్డి, కార్యవర్గ సభ్యులుగా శివశంకర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, పార్థసారథిరెడ్డిలను ఎంపిక చేసినట్లు ఆయన వివరించారు.

క్షేత్రాలను సందర్శించిన సచివాలయ ఉద్యోగులు



పుష్పగిరిలో సెక్రటేరియట్ వెల్ఫేర్ ఉద్యోగులు

ఒంటిమిట్ట/వల్లూరు: ప్రముఖ పుణ్యక్షేత్రాలైన ఒంటిమిట్ట, పుష్పగిరిలను ఆంధ్రప్రదేశ్ సెక్రటేరియట్ వెల్ఫేర్ మహిళా అధికారులు, ఉద్యోగుల బృందం శనివారం సందర్శించింది. ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయంలోని శ్రీ సీతారామలక్ష్మణులను వారు దర్శించుకున్నారు. వారికి ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అలాగే పుష్పగిరిలోని శ్రీ కామాక్షీ వైద్యనాథేశ్వరస్వామి, శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి,సంతాన మల్లేశ్వరస్వామికి పూజలు చేశారు. ఆలయ అనువంశిక ధర్మకర్త దుగ్గిరెడ్డి వెంకట సుబ్బారెడ్డి, ఇన్‌చార్జి ఈవో శ్రీనివాసులు, పురావస్తుశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవం.. ప్రతిష్టా మహోత్సవం



బిషప్ ఐజాక్‌వరప్రసాద్‌ను ఊరేగిస్తున్న దృశ్యం

కలసపాడు: వైఎస్సార్ జిల్లా కలసపాడులోని సగిలేరు ఒడ్డున ఉన్న పరిశుద్ధ పరిపేతురు పరిపాలు చర్చి 136వ ప్రతిష్టా మహోత్సవం శనివారం వైభవంగా జరిగింది. రాష్ట్ర నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. రాత్రి చర్చి ప్రాంగణమంతా భక్తులతో నిండిపోయింది. బ్రిటిష్ హయాంలో నిర్మించిన చర్చి వేడుకలను చూసేందుకు వేలాదిగా భక్తులు తరలివచ్చారు. వారు చర్చి లోపల క్రీస్తు శిలువకు మొక్కులు చెల్లించుకున్నారు. రాయలసీమ డయాసిస్ బిషప్ రైట్ రెవరెండ్ డాక్టర్ పి.ఐజాక్‌వరప్రసాద్‌ను కలసపాడు వైఎస్‌ఆర్ సర్కిల్ నుంచి మేళతాళాలతో చర్చి వద్దకు ఊరేగింపుగా తీసుకువచ్చారు. చర్చి డీనరీ చైర్మన్ సంజయ్‌మధు, ఆశిస్‌గాబ్రియేల్, బేబీసరోజ, రవిక్రీస్తుదారి, శ్రీనివాస్‌పాల్‌లు తదితరులు బిషప్‌కు పూలమాలలు వేసి సత్కరించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ధర్మ సూక్తులను ప్రసంగించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్చి కమిటీ వారు అన్ని వసతులు కల్పించారు.

ఓటర్లకు అవగాహన కోసం ఈవీఎం ప్రదర్శన

రాయచోటి: ఈవీఎంల ద్వారా ఓటువేసే విధానాన్ని ఓటర్లకు వివరించాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ ఆదేశించారు. శనివారం మధ్యాహ్నం అన్నమయ్య జిల్లా కేంద్రం, రాయచోటిలోని కలెక్టరేట్‌లో ఈవీఎంలు ద్వారా ఓటువేసే విధానాన్ని ఓటర్లకు వివరించేందుకు ఏర్పాటు చేసిన ఈవీఎం ప్రదర్శనా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం కొంతమంది ప్రజలకు ఓటువేసే విధానాన్ని వారితో ఓటు వేయించి విపులంగా వివరించారు. ప్రతి ఓటరు, పోలింగ్ యూనిట్ మీద ఉన్న పేర్లలో తాను ఎన్నుకోవాలనుకున్న వ్యక్తి పేరుకు ఎదురుగా ఉన్న నీలిరంగు బటన్ నొక్కినప్పుడు ఓటు వేసినందుకు గుర్తుగా ఎరుపు రంగు బల్బు వెలుగుతుందన్నారు.ఓటు వేసినందుకు గుర్తుగా శబ్దం వినిపించకపోయినా లేదా ఎరుపురంగు బలుపు వెలగకపోయినా, ముద్రితమైన కాగితం చూపించకపోయినా సంబంధిత పోలింగ్ అధికారికి ఓటర్లు తెలపాలని సూచించారు. డీఆర్‌ఓ సత్యనారాయణ, ఏఓ బాలకృష్ణ పాల్గొన్నారు.

భవిత.. చేయూత

- ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు భరోసా
- నేడు దివ్యాంగుల దినోత్సవం



క్రీడల్లో పాల్గొంటున్న ప్రత్యేక అవసరాల పిల్లలు (ఇన్‌సెట్) స్పీచ్‌థెరఫీ చేస్తున్న ఐఈఆర్‌టీ టీచర్

మదనపల్లె సిటీ: బాల్యం మధుర జ్ఞాపకం. చిన్న వయస్సులో పిల్లలు ఆడుతూ పాడుతూ కేరింతలు కొడుతూ, వచ్చీరాని మాటలను పలుకుతుంటే తల్లిదండ్రులకు కలిగే ఆనందం అనుభవిస్తేగాని వర్ణించలేనిది. కానీ జన్యుపరమైన లోపాలతో మానసిక, శారీరక వైకల్యానికి గురైన ఎంతో మంది పిల్లలు, వారిని చూసి వారి తల్లిదండ్రులు మానసిక క్షోభకు గురవుతుంటారు. ఇలాంటి ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారుల కోసం సమగ్రశిక్ష భవిత కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఈ కేంద్రాలు దివ్యాంగ పిల్లలను అక్కున చేర్చుకుంటున్నాయి. ఫిజియోథెరఫీ, స్పీచ్ థెరఫీతో పాటు ప్రత్యేక విద్య ద్వారా వారి ప్రవర్తనలో మార్పు తెచ్చి తోటి చిన్నారుల మాదిరి సాధారణ పాఠశాలలకు వెళ్లి చదువు కొనసాగించేలా తీర్చిదిద్దడం లక్ష్యంగా పని చేస్తున్నాయి. సత్ఫలితాలు సాధిస్తున్నాయి. అమ్మలా లాలన, నాన్నలా భరోసా ఇస్తూ వారి జీవితాల్లో వెలుగు రేఖలు నింపేందుకు ఇక్కడి సిబ్బంది కృషి చేస్తున్నారు. సమగ్రశిక్ష ఆధ్వర్యంలో జిల్లాలో 2012 నుంచి భవిత కేంద్రాల సేవలు అందుబాటులోకి వచ్చాయి. నేడు ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా కథనం.

ఉపకరణాలు పంపిణీ

జిల్లాలోని 30 మండలాలకు సంబంధించి పలువురికి అవసరమైన ఉపకరణాలు పంపిణీ చేశారు. ఇందులో వీల్‌చైర్స్ ట్రైసైకిల్స్,పీ వీల్ చైర్స్ వినికిడి యంత్రాలు, రొలేటర్స్ తో పాటు ఇతర ఉపకరణాలు ఉన్నాయి. ఇటీవల భవిత కేంద్రంలోని పిల్లలకు 143 ట్యాబ్‌లను పంపిణీ చేశారు.

- భవిత కేంద్రాలు: 30
- ఫిజియోథెరఫిస్టులు: 10
- భవిత సెంటర్ల ద్వారా సేవలు పొందేవారు: 463
- దృష్టి లోపం: 26 మంది
- మాటలు పలకలేనివారు: 53
- ఐఈఆర్‌పీలు (ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ రీసోర్సుపర్సన్): 60



- ప్రత్యేక అవసరాలుగల చిన్నారుల కోసం సమగ్రశిక్ష ప్రతి మండలంలో ఒక భవిత కేంద్రాన్ని ఏర్పాటు చేసి ఫిజియోథెరపిస్టు ద్వారా సేవలందిస్తుంది. ఇందులో 21 రకాల వైకల్యాలున్న పిల్లలకు శిక్షణ ఇస్తారు. వారి వారి అవసరాలను బట్టి ఫిజియోథెరఫీ, స్పీచ్ థెరఫీ, సైకలాజికల్ థెరఫీతో శిక్షణ కల్పిస్తారు. ప్రతి మూడు మండలాలకు ఒకరు చొప్పున 10 మంది ఫిజియోథెరఫిస్టులున్నారు. వీరు వారంలో మూడు రోజుల పాటు మూడేసి మండలాల ప్రకారం మండల పరిసరాల్లోని ప్రత్యేక అవసరాలుగల పిల్లల ఇంటికి వెళ్లి సేవలందిస్తారు. తల్లిదండ్రులు, సంరక్షకులకు అవసరమైన సలహాలు, సూచనలిస్తారు.

ఆర్థిక తోడ్పాటు: భవిత కేంద్రానికి శిక్షణ నిమిత్తం వచ్చే ఒక్కో విద్యార్థికి నెలకు రూ.300 ఇస్తున్నారు. శిక్షణ పూర్తి చేసుకుని సాధరణ పాఠశాలలో చేరిన నడవలేని విద్యార్థికి తోడుగా వచ్చే కుటుంబసభ్యులకు నెలకు రూ.300 అందిస్తున్నారు.

తల్లిదండ్రులు అధైర్యపడొద్దు



మానసిక, శారీరక వైకల్యం ఉన్న పిల్లల తల్లిదండ్రులు అధైర్యపడొద్దు. జన్యులోపంతో వచ్చిన సమస్యగానే చూడాలి తప్ప దేవుడి శాపం తదితర పేర్లు పెట్టి వారిని శాశ్వత వికలాంగులుగా మార్చొద్దు. భవిత కేంద్రాలకు తీసుకొచ్చే పిల్లలను సొంతపిల్లలుగా భావించి సేవలు అందిస్తున్నాం. ఫలితాలు చూసి తల్లిదండ్రులు సంతోషపడుతున్నారు

-జనార్ధన్, సహిత విద్య జిల్లా కోఆర్డినేటర్

భవితతో భరోసా కల్పిస్తున్నాం



దివ్యాంగ పిల్లలను అక్కున చేర్చుకుని వారి భవిష్యత్తుకు భరోసా కల్పిస్తున్నాం . భవిత కేంద్రాలను వీరు సద్వినియోగం చేసుకునేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు చూడాలి.

-శ్రీరాం పురుషోత్తం, డీఈఓ

కొలువుల మేళా.. ఆనందహేల






జ్యోతి వెలిగిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్, జెడ్పీ ఛైర్మన్ తదితరులు, జాబ్‌మేళాకు హాజరైన నిరుద్యోగ యువతీ యువకులు

ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా


రాయచోటి: ఉద్యోగం..ఓ ఇంటికి ఆర్థిక పునాది.విద్యార్థి జీవితానికి చక్కని దారి. చదువుకున్న ప్రతి ఒక్కరికీ ఉద్యోగం కల్పించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది. వివిధ కోర్సులు అభ్యసించిన విద్యార్థులకు ఉద్యోగాల కల్పనకు జాబ్‌మేళాలు నిర్వహిస్తోంది.దీనికి శనివారం రాయచోటిలోని సాయి ఇంజినీరింగ్ కళాశాలలో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ సహకారంతో నిర్వహించిన మెగా జాబ్‌మేళాయే నిదర్శనం. ఇందులో 120 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. సుమారు 6 వేల మంది ఉద్యోగ, ఉపాధి కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో ఉద్యోగాలకు ఎంపికైన 1880 మందికి ఎంపీ, ఎమ్మెల్యే నియామక పత్రాలు అందజేశారు.మెగా జాబ్‌మేళాను జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి,కలెక్టర్ గిరీషాతో కలిసి ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ప్రారంభించారు.కార్యక్రమంలో మైనార్టీ కమిషన్ చైర్మన్ ఇక్బాల్ అహ్మద్, మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డి, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి, ఎం.చిదంబర్‌రెడ్డి, జెడ్పీటీసీలు వెంకటేశ్వరరెడ్డి, మాసన వెంకటరమణ, ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ వండాడి వెంకటేశ్వర్లు, మున్సిపల్ వైస్‌చైర్మన్ ఫయాజుర్‌రెహమాన్; మైనార్టీ జిల్లా అధ్యక్షుడు బేపారి మహమ్మద్‌ఖాన్; మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్, ఎంపీడీఓ మల్‌రెడ్డి, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి హరికృష్ణ, సాయి ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. మేళాకు అన్నమయ్య, సత్యసాయి జిల్లాల నుంచి నిరుద్యోగ యువత వర్షాన్ని సైతం లెక్క చేయకుండా తరలివచ్చారు. వీరికి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో భోజన వసతులు కల్పించారు. ఇంటర్వ్యూలు జరుగుతున్న తీరును ఎంపీ, ఎమ్మెల్యే పరిశీలించారు.

పారిశ్రామికరంగంలో ఏపీ ముందంజ: ఎంపీ మిథున్‌రెడ్డి



పారిశ్రామికరంగంలో రాష్ట్రం ముందంజలో నిలుస్తోందని ఎంపీ మిథున్‌రెడ్డి అన్నారు. రాజంపేట పార్లమెంట్ పరిధిలో ఇప్పటి వరకు నిర్వహించిన జాబ్‌మేళాల ద్వారా 7 వేల మందికి ఉద్యోగావకాశాలను కల్పించినట్లు చెప్పారు. వారం పాటు ఇంటర్వ్యూల ప్రక్రియ జరుగుతుందన్నారు.రాష్ట్రంలో 3 పోర్టులు, 10 షిప్పింగ్ హార్బర్‌ల అభివృద్ధిని సీఎం జగన్ చేపట్టారన్నారు.

యువతకు పెద్దపీట: ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి



జగన్ పాలనలో యువతకు పెద్దపీట వేసినట్లు ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు.నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించాలనే నేడు 20 ఐటీ, 100 ఇతర కంపెనీలతో జాబ్‌మేళా నిర్వహిస్తున్నామన్నారు. పబ్లిసిటీ, ఫొటోల కోసం కాదన్నారు. రాయచోటి అన్నివిధాలా అభివృద్ధి చెందుతోందని ఎమ్మెల్యే అన్నారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి: ఆకేపాటి



జాబ్‌మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి అన్నారు. సీఎం వైఎస్ జగన్ విద్య, వైద్యరంగాలకు పెద్దపీట వేశారన్నారు. పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో ఎంపీ మిథున్‌రెడ్డి, జాబ్‌మేళాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.

నైపుణ్యాలను పెంపొందించుకోవాలి: కలెక్టర్



యువత నైపుణ్యాలను పెంపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ గిరీషా తెలిపారు. జిల్లాలో ఎంపీ మిథున్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యేలు ప్రభుత్వం ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించే ప్రయత్నాలు చేయడం హర్షించదగిన విషయమని అన్నారు.

సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో..

గ్రూప్-1, 2 ఉద్యోగ పరీక్షలపై
ఉచిత అవగాహన సదస్సు

- డిసెంబర్ 16వ తేదీన వైఎస్సార్ కడపలో సదస్సు
- గెస్ట్ స్పీకర్‌గా సివిల్స్ విజేత బాలలత
- లక్ష్యం: విద్యార్థులకు గ్రూప్-1, గూప్-2 పరీక్షలపై అవగాహన కల్పించడం

సాక్షి ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గ్రూప్-1, గ్రూప్-2 ఉద్యోగాల భర్తీకి త్వరలోనే ఏపీపీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో..గ్రామీణ, పట్టణ విద్యార్థులను గ్రూప్-1, గ్రూప్-2 స్థాయి ఉద్యోగులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో.. సాక్షిఎడ్యుకేషన్.కామ్ (www.sakshieducation.com) ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా ఉచిత అవగాహన సదస్సులను నిర్వహించనుంది. గత కొన్ని సంవత్సరాలుగా వివిధ పోటీపరీక్షలకు ప్రిపేరయ్యే అభ్యర్థులకు సాక్షిఎడ్యుకేషన్.కామ్ తోడుగా ఉంటున్న విషయం మీ అందరికి తెల్సిందే.

గెస్ట్ స్పీకర్‌గా బాలలత

ఎంతో మందిని పోటీ పరీక్షల్లో విజేతలుగా తీర్చిదిద్దుతున్న సివిల్స్ టాపర్ బాలలత గారు గ్రూప్-1, గ్రూప్-2 ఉద్యోగ పరీక్షలపై ఉచిత అవగాహన సదస్సుకు గెస్ట్ స్పీకర్‌గా హాజరుకానున్నారు. ఆమె గ్రూప్-1, గ్రూప్-2 పరీక్షలపై అవగాహన కల్పించడంతో పాటు విద్యార్థుల సందేహాలను నివృత్తి చేయనున్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు 81791 00598 ఫోన్ నంబర్‌కు తమ పేరు, ఫోన్ నంబర్, జిల్లా వివరాలను వాట్సప్‌లో పంపగలరు.

ముఖ్య సమాచారం

అవగాహన సదస్సు తేదీ
డిసెంబర్ 16, 2023 (శనివారం)

వేదిక
హరిత హోటల్, ఎస్పీ బంగ్లా ఎదురుగా, కోటిరెడ్డి సర్కిల్, కడప

సమయం
ఉదయం 09:30 నుంచి 12:30 వరకు.

వివరాలకు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్ : 8179100598

తిరుమల ఎక్స్‌ప్రెస్ రద్దు

కడప కోటిరెడ్డిసర్కిల్: కడప–విశాఖపట్టణం–కడపల మధ్య నడుస్తున్న తిరుమల ఎక్స్‌ప్రెస్ ఈ నెల 4 నుంచి 6 వరకు రద్దు చేశారని కడప రైల్వే చీఫ్ టిక్కెట్ ఇన్‌స్పెక్టర్ ఉమర్‌బాషా, సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ తెలిపారు. తుపాను ప్రభావంతో రద్దు చేశారని వారు పేర్కొన్నారు.

ఆవుల దాడిలో విద్యార్థికి గాయాలు

రైల్వేకోడూరు అర్బన్ :చిట్వేలి రోడ్డులో ఓ విద్యార్థిపై శనివారం ఆవుల గుంపు దాడి చేయడంతో గాయాలయ్యాయి. అక్కడే ఉన్న ఏపీ టూరిజం డైరెక్టర్ మండల నాగేంద్ర స్పందించి విద్యార్థిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లి వైద్యం చేయించారు. ఆవుల విషయమై చర్య తీసుకోవాలని పంచాయతీ అధికారులను కోరారు.

ఆటోను ఢీకొన్న కారు, ఇసుక ట్రాక్టర్

మహిళ మృతి, నలుగురికి గాయాలు





ప్రమాదస్థలంలో మహిళను ఢీకొన్న ట్రాక్టర్, మహిళ మృతదేహం, దెబ్బతిన్న ఆటో, ప్రమాదానికి కారణమైన కారు



లక్ష్మీదేవి మృతదేహం



లక్ష్మీదేవి(ఫైల్)



తీవ్రంగా గాయపడ్డ శ్వేత



గాయపడ్డ లక్ష్మీనారాయణ

మదనపల్లె : ప్రయాణికులతో వెళుతున్న ఆటోను ముందువైపు నుంచి కారు, వెనుకవైపు నుంచి ఇసుక ట్రాక్టర్ ఒకేసారి ఢీకొనడంతో ఆటోలోని మహిళ అక్కడికక్కడే మృతిచెందగా, నలుగురికి గాయాలైన సంఘటన శనివారం మదనపల్లె మండలంలో జరిగింది. వాల్మీకిపురం మండలం చింతపర్తి బోయపల్లెకు చెందిన కె.మహేష్‌బాబు సొంతంగా ఆటో నడుపుకుని జీవనం సాగిస్తున్నాడు. శనివారం డెయిరీకి పాలు తరలించిన అనంతరం చింతపర్తి నుంచి మదనపల్లెకు ప్రయాణికులతో బయలుదేరాడు. వాల్మీకిపురం ఇందిరమ్మకాలనీ వద్ద స్థానికులైన నాగశేషు భార్య కొల్లారి లక్ష్మీదేవి(52), ఆమె అల్లుడు, ఆర్టీసీ కాంట్రాక్ట్ డ్రైవర్‌గా పనిచేస్తున్న సి.లక్ష్మీనారాయణ(35), అతని భార్య శ్వేత(33) మదనపల్లెలో ఆస్పత్రికి బయలుదేరారు. మార్గమధ్యంలో మదనపల్లె మండలం సీటీఎం పంచాయతీ పూలవాండ్లపల్లె సమీపంలోని కంకర ఫ్యాక్టరీ వద్ద మదనపల్లె–తిరుపతి జాతీయ రహదారిపై మదనపల్లె నుంచి వాల్మీకిపురం వైపుగా వెళుతున్న మారుతి స్విఫ్ట్ కారు ఆటోను వేగంగా ఢీకొంది. అదే సమయంలో ఆటోకు వెనుకవైపుగా వస్తున్న ఇసుక ట్రాక్టర్ వేగాన్ని అదుపుచేయలేక ఆటోను ఢీకొంది. రెండువైపుల నుంచి వాహనాలు ఆటోను ఢీకొనడంతో ఆటో నుజ్జునుజ్జయింది. దీంతోపాటు, కారు ఆటోను ఢీకొన్న సమయంలో ఆటోలోని ప్రయాణికురాలు సి.లక్ష్మీదేవి కిందపడిపోగా, వెనుకవైపు నుంచి వచ్చిన ఇసుక ట్రాక్టర్ ఆమెను ఢీకొని వెళ్లడంతో కాలు, చేతులు విరిగి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. ప్రమాదంలో లక్ష్మీదేవి అల్లుడు లక్ష్మీనారాయణ, కుమార్తె శ్వేత, ఆటోడ్రైవర్ మహేష్‌బాబు, కారు డ్రైవర్ వెంకటేష్ తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే స్థానికులు ఆటోను ఢీకొన్న ట్రాక్టర్‌ను పక్కకు తీసి, లక్ష్మీదేవిని, గాయపడ్డ వారిని 108 అంబులెన్స్‌లో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. వీరిలో లక్ష్మీనారాయణ, శ్వేత పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం తిరుపతికి రెఫర్ చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. తాలూకా ఎస్‌ఐ సుధాకర్ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి వెళ్లి ప్రమాద వివరాలను సేకరించారు. లక్ష్మీదేవి కుమారుడు రాజేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్‌ను ఘటన నుంచి తప్పించే యత్నం..

సీటీఎం కంకర ఫ్యాక్టరీ వద్ద ఆటోను కారు, ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో కారు, ఆటోను తాలూకా స్టేషన్‌కు తరలించి, ఇసుక ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకోకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. ఆటో డ్రైవర్ మహేష్‌బాబు, ఘటనలో గాయాలపాలైన వారు ట్రాక్టర్ ఢీకొనడంతోనే ప్రమాద తీవ్రత పెరిగి మహిళ మృతి చెందిందని చెబుతున్నారు. అయితే పోలీసులు మాత్రం కేసు విచారణలో ప్రమాదానికి ఇసుక ట్రాక్టర్ కారణం కాదని, అసలు ట్రాక్టర్ ఆటోను, మహిళను ఢీకొనలేదని చెబుతున్నారు. ప్రమాదంలో మృతిచెందిన మహిళ బంధువులు, క్షతగాత్రులు చెప్పిన విషయాన్ని పరిగణనలోకి తీసుకోకుండా కేసులో నుంచి ఇసుక ట్రాక్టర్‌ను తప్పించేందుకు ప్రయత్నించారని వారు వాపోయారు.

డెయిరీ పార్లర్‌లో అగ్నిప్రమాదం

పీలేరు రూరల్ : విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా డెయిరీ పార్లర్‌లో అగ్నిప్రమాదం జరిగిన సంఘటన శనివారం పీలేరు పట్టణంలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. స్థానిక చిత్తూరు రోడ్డులో సిద్ధారెడ్డి హాట్సన్ మిల్క్ డెయిరీ నిర్వహిస్తున్నాడు. శనివారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వ్యాపించాయి. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో అగ్నిమాపక అధికారి మస్తాన్ ఆధ్వర్యంలో మంటలు అదుపు చేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ. 3 లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది హేమాద్రి, శ్రీనివాసులు, వెంకటేష్, షకీల్‌వలి పాల్గొన్నారు.

11న కళా ఉత్సవ్ జిల్లాస్థాయి పోటీలు

విజేతలకు పార్లమెంట్ సందర్శన అవకాశం

రాయచోటి అర్బన్ : ఈనెల 12న డైట్ కళాశాలలో జిల్లాస్థాయి కళా ఉత్సవ్–2023 పోటీలను నిర్వహిస్తున్నట్లు డైట్ ప్రిన్సిపల్ అజయ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు." ఎస్‌సీఈఆర్‌టీ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. జాతీయ స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థాయిలో విజేతలకు పార్లమెంట్‌ను సందర్శించేందుకు అవకాశం కల్పిస్తామన్నారు. 10 కేటగిరిలలో పోటీలు ఉంటాయన్నారు. అందులో శాస్త్రీయ సంగీతం, జానపద సంగీతం, డ్రమ్స్, తబలా, కంజీర, కాంగో వంటి వాయిద్యపరికరాలను వాయించడం, వీణ, వయోలిన్, సితార, సరోద్, షహనాయి, సంతూర్ మొదలగు తీగ వాయిద్యాలు వాయించడం, భరతనాట్యం, కూచిపూడి వంటి శాస్త్రీయ నృత్యాలు, ఆంధ్రరాష్ట్రానికి చెందిన జానపద నృత్యా లు, 2డీ విజువల్ ఆర్ట్స్, 3డీ విజువల్ ఆర్ట్స్, స్వదేశీ ఆటవస్తువులు, బొమ్మల తయారీ, రాష్ట్రానికి చెందిన గొప్ప సంస్కర్తలు, కళాకారులు, రచయితలు, కవులు, శాస్త్రవేత్తలు, స్వాతంత్య్ర సమరయోధుల గురించిన ఏకపాత్రాభినయం పోటీలు నిర్వహిస్తామని వివరించారు. ఈ విభాగాలలో నిర్వహించే పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారు రాష్ట్ర స్థాయికి, అక్కడ ప్రతిభ చాటిన వారు జాతీయ స్థాయి పోటీలకు వెళ్లాల్సి ఉంటుందన్నారు. జాతీయస్థాయిలో ప్రతి కేటగిరిలో ప్రతిభ కనబరిచిన వారికి మొదటి బహుమతి రూ.25వేలు, ద్వితీయ బహుమతి రూ. 20 వేలు, తృతీయ బహుమతి రూ.15వేలు అందజేయడంతో పాటు నూతన పార్లమెంటు భవనాన్ని సందర్శించే అవకాశం కల్పిస్తారన్నారు. పాఠశాలల హెచ్ఎంలు అందరూ విద్యార్థులను పోటీలకు సంసిద్ధులను చేయాలని కోరారు. మరిన్ని వివరాలకు 9441228359, 9440084715 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

వేర్వేరు ఘటనల్లో ముగ్గురి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ఘటనల్లో ముగ్గురు వ్యక్తులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కలకడ మండలం ఎనుగొండపాళెం పంచాయతీ గూండావారిపల్లెకు చెందిన నీలావతమ్మ(40) కుటుంబ సమస్యలతో శనివారం పురుగుమందు తాగింది. అదేవిధంగా బి.కొత్తకోట మండలం కమ్మచెరువుకు చెందిన బాబు(26) భార్యతో గొడవపడి శుక్రవారం రాత్రి పురుగుమందు తాగాడు. అలాగే తంబళ్లపల్లె మండలం కోటకొండ పంచాయతీ వడ్డిపల్లెకు చెందిన హరీష్(24) ఆర్థిక ఇబ్బందులతో శుక్రవారం రాత్రి పురుగుమందు తాగాడు. ఆయా ఘటనల్లో గమనించిన కుటుంబసభ్యులు 108 అంబులెన్స్‌లో బాధితులను మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

హెచ్‌పీసీఎల్‌లో మాక్ డ్రిల్



మాక్‌డ్రిల్‌లో మంటలు ఆర్పుతున్న దృశ్యం

సిద్దవటం : మండలంలోని భాకరాపేట గ్రామ సమీపంలో ఉన్న హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్‌లో శనివారం మాక్ డ్రిల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయిల్ ట్యాంకర్ వద్ద మంటలు వ్యాపించినప్పుడు సైరన్ మోగడంతో సిబ్బంది అప్రమత్తమై ఆ మంటలను ఆర్పే సన్నివేశాన్ని ప్రదర్శించారు. తరువాత అక్కడ స్వల్ప గాయాలైన ఇద్దరు వ్యక్తులను స్ట్రెచర్‌లో తీసుకొచ్చే సన్నివేశాలను మాక్‌డ్రిల్‌లో చేసి చూపించారు. అలాగే హెచ్‌పీసీఎల్‌లో మరో చోట పైప్‌లైన్ పనులు చేస్తుండగా ఆయిల్ లీక్ కావడంతో బోల్టులు బిగిస్తుండగా బోల్టు పొరపాటున కిందపడి మంటలు వ్యాపించడంతో మరో సారి సైరన్ మోగడంతో సిబ్బంది అప్రమత్తమై ఆర్పే సన్నివేశాన్ని కూడా చూపించారు. అన్ని విభాగాల వారు మాక్‌డ్రిల్ బాగా చేశారని డిప్యూటీ చీఫ్ ఇన్స్‌పెక్టర్ కృష్ణమూర్తి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌పీసీఎల్ డిపో మేనేజర్ బి. మన్మథరావు, వీటీపీఎల్ పైప్‌లైన్ మేనేజర్ ఓబయ్య, ఐఓసీఎల్ సేఫ్టీ అధికారి సునీల్‌కుమార్‌పాండే, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారి సునీల్‌కుమార్, జిల్లా అగ్నిమాపక అధికారులు బి. జలీల్, ఎస్. వీరారెడ్డి, డాక్టర్ శివకుమార్, హెచ్‌పీసీఎల్ సేఫ్టీ అధికారి ప్రతీష్‌కుమార్, హెచ్‌పీసీఎల్,సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

బస్సు ఫుట్‌బోర్డు నుంచి కిందపడి టీచర్‌కు తీవ్ర గాయాలు



గాయపడిన టీచర్ పురుషోత్తం

మదనపల్లె : ఆర్టీసీ బస్సు ఫుట్‌బోర్డు నుంచి జారిపడి టీచర్ తీవ్రంగా గాయపడిన సంఘటన శనివారం ములకలచెరువు మండలంలో జరిగింది. పీటీఎం మండలం టి.సదుం పంచాయతీ రామాపురానికి చెందిన సి.పురుషోత్తం(43) ములకలచెరువు జెడ్పీ హైస్కూల్‌లో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. శనివారం స్వగ్రామానికి వెళ్లేందుకు ఆర్టీసీ బస్సు ఎక్కాడు. మార్గమధ్యంలో బురకాయలకోట కరెంటు ఆఫీసు వద్ద బస్టాప్‌లో ఫుట్‌బోర్డు నుంచి కిందకు దిగి మళ్లీ బస్సు ఎక్కే క్రమంలో ప్రమాదవశాత్తు జారి కిందపడటంతో బస్సు వెనుక టైరు కాలిపై ఎక్కింది. ప్రమాదంలో టీచర్ తీవ్రంగా గాయపడటంతో స్థానికులు 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. వైద్యచికిత్స అనంతరం ఆయన పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు.

ఆటోవాలా నిజాయితీ



బ్యాగులో ఉన్న బంగారు నగలను బాధిత మహిళకు అప్పగించిన సీఐ, సిబ్బంది

సిద్దవటం : ఓ మహిళ బంగారు నగలు ఉన్న బ్యాగును తన ఆటోలో మరచిపోయి దిగి వెళ్లిన విషయాన్ని గమనించిన ఆటోడ్రైవర్ వెంకటసుబ్బయ్య ఆ బ్యాగును పోలీసులకు అప్పగించి తన నిజాయితీని చాటుకున్నాడు. ఒంటిమిట్ట సీఐ పురుషోత్తంరాజు కథనం మేరకు.. సిద్దవటం మండలం కమ్మపాలెం గ్రామానికి చెందిన వెంకటసుబ్బయ్య ఆటోలో భాకరాపేట నుంచి సిద్దవటానికి ఓ మహిళ ప్రయాణించింది. ఆ మహిళ బంగారు నగలు ఉన్న బ్యాగును ఆటోలో మరచిపోయి దిగి వెళ్లిపోయింది. ఈ మేరకు ఆటో డ్రైవర్ బ్యాగును గమనించి సిద్దవటం పోలీసు స్టేషన్‌లో అప్పగించాడు. బ్యాగులో దాదాపు రూ. 2లక్షలు విలువ చేసే బంగారు నగలు ఉన్నాయి. అందులో ఉన్న ఆధార్ కార్డు సహాయంతో బాధిత మహిళను గుర్తించి ఆమెకు బంగారు నగల బ్యాగును అప్పగించామని సీఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఐ బాబయ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య పథకాలపై అవగాహన

కడప రూరల్ : వైద్య ఆరోగ్య శాఖలో అమలయ్యే పథకాలపై అవగాహన కల్పించాలని ఆ శాఖ ఆర్డీ డాక్టర్ రత్నకుమారి తెలిపారు. శనివారం జోన్–4 పరిధిలోని డెమో, డిప్యూటీ డెమోలతో సమావేశం నిర్వహించారు.



సిఫార్సు లేకుండా ఇల్లు మంజూరైంది



గత కొన్నేళ్లుగా అద్దె ఇంటిలో జీవనం సాగిస్తున్నాం. కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునే మాకు సొంతిల్లు ఓ కలగా మిగిలిపోయింది. గతంలో అర్జీలు పెట్టుకున్నా ఇల్లు మంజూరు కాలేదు. జగనన్న ప్రభుత్వం ఎలాంటి సిఫార్సు లేకుండానే మాకు ఏపీఐఐసీ లేఅవుట్‌లో ఇల్లు మంజూరు చేసింది. ఇంటి నిర్మాణం పూర్తి చేసుకున్నాం. త్వరలో గృహప్రవేశం చేసుకోవడానికి ఏర్పాట్లు చేస్తున్నాం.

– సరళ, బండ్లవంక, పీలేరు.

రేషన్ కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు పొందాను



గత ప్రభుత్వంలో రేషన్ కార్డు మంజూరు కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ వందల సార్లు తిరిగాను. కానీ ఫలితం లేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ఇంటి వద్దకే వచ్చి మా సమస్యను తెలుసుకుని రేషన్ కార్డుతో పాటు ఆరోగ్యశ్రీ కార్డు మంజూరు చేయించారు.

– మెహరూన్, ఇందిరాకాలనీ, ములకలచెరువు.